క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా జిల్లా కేంద్రంలోని టౌన్-2 పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఆర్.స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఏసీసీ సబ్‌స్టేషన్‌లోని 11కేవి లైన్ మరమ్మతుల కారణంగా మార్కెట్ ఏరియాలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, గౌతమినగర్, ఇస్లాంపూర ప్రాంతాలకు 12గంటల నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలలో నమూనా ఎన్నికలు


నమూనా ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులుగా పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లు, పోలీసులు, భూత్ ఆఫీసర్లుగా, రిటర్నింగ్ అసిస్టెంట్ ఆఫీసర్లుగా విద్యార్థులే వ్యవహరించి ఆద్యంతం చక్కగా పనితీరును చాటి చెప్పారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సాగర్ మాలవీదేవి మాట్లాడుతూ.. ఈ నమూనా ఎన్నికల నిర్వహణతో విద్యార్థులకు ఎన్నికల విధి విధానాలు స్పష్టంగా అర్థం అయ్యాయన్నారు. భవిష్యత్‌లో అనుభవాన్ని ఉపయోగించుకుని ప్రస్తుతం వారి తల్లిదండ్రులను వచ్చే ఎన్నికల్లో పాల్గొనేలా చైతన్య పరుస్తారన్నారు. ఉపాధ్యాయులు స్వప్న, పల్లవి, సత్యేంద్రకుమార్, శ్రీనివాస్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలపై అక్రమ నిర్మాణాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: గత నెల 12న 'సాక్షి' దిన పత్రికలో ప్రచురితమైన 'కాలువలపై అక్రమ నిర్మాణాలు' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మార్కెట్‌లోని మున్సిపాలిటీ పరిధిలోని కాలువలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను రెండు రోజుల క్రితం టీపీఎస్ రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్ ప్రాంతంలో కాలువలపై అక్రమ నిర్మాణాలు ఎక్కువగా ఉన్నాయని, వాటన్నింటినీ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు పరిశీలించామని తెలిపారు. గుర్తించిన అక్రమ నిర్మాణ దారులకు చట్టపరంగా నోటీసులు జారీ చేస్తామని టీపీఎస్ తెలిపారు.

మందమర్రి సీఐగా శశిధర్


శశిధర్


కుమారస్వామి

మందమర్రిరూరల్: మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శశిధర్ సర్కిల్ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. దేవాపూర్, కాసిపేట, మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్(సర్కిల్‌పరిధి)ల పరిధిలోని ప్రజలంతా శాంతి భద్రతలకు సహకరించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఫిర్యాదు చేయాలని సూచించారు. సిబ్బంది సీఐని సన్మానించారు.

తాండూర్ సీఐగా కుమారస్వామి

తాండూర్: తాండూర్ పోలీస్‌సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.కుమారస్వామి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శ్రీనివాసరావు మల్టీజోన్-1కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన కుమారస్వామి మల్టీజోన్-1 నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా విధుల్లో చేరిన సీఐ కుమారస్వామికి స్థానిక ఎస్సైలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

బొప్పారంలో పర్యటన


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

కోటపల్లి: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్సై రాజేందర్ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని బొప్పారంలో శనివారం పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులకు సహకరించొద్దని, యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్యాం, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

సమస్యల్లో లైబ్రరీలు

- పాత భవనాలు.. కాలం చెల్లిన పుస్తకాలు
- కనీసం వార్త పత్రికలు కూడా అందుబాటులో లేని వైనం
- పోటీ పరీక్షల వేళ నిరుద్యోగులకు తప్పని అవస్థలు


లక్సెట్టిపేట గ్రంథాలయంలో చిందరవందరగా పుస్తకాలు

రాష్ట్రంలో మళ్లీ పోటీ పరీక్షల సందడి మొదలైంది. టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే గ్రూప్- 1 నోటిఫికేషన్ విడుదల చేయగా.. మరోవైపు 288 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ కూడా వచ్చేసింది. దీంతో నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధమవుతున్నారు. సమీపంలోని గ్రంథాలయాలకు పరుగులు పెడుతున్నారు. అయితే జిల్లాలోని విజ్ఞాన భాండాగారాలు వారికి సమస్యలతో స్వాగతం పలుకుతున్నాయి. పాత భవనాలు.. కాలం చెల్లిన పుస్తకాలు.. వసతుల లేమితో లైబ్రరీలు కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లాలో దశాబ్దాల చరిత్ర కలిగిన గ్రంథాలయాలు ఉన్నా నిధులు లేక, అధికారుల నిర్లక్ష్యంతో నిరాదరణకు గురవుతున్నాయి. రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశం ఉన్నందునా లైబ్రరీల్లో వసతులు కల్పించి, పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని నిరుద్యోగ యువతీ యువకులు కోరుతున్నారు.

పాత ఫారెస్ట్ కార్యాలయంలో...


పాత ఫారెస్ట్ కార్యాలయంలో నెన్నెల గ్రంథాలయం

బెల్లంపల్లి: ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లు జారీ చేయడంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. 30ఏళ్ల పాటు నెన్నెల ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన గ్రంథాలయం ఇటీవల పాత ఫారెస్ట్ కార్యాలయంలోకి తరలించారు. ఫారెస్ట్ కార్యాలయంలో ఓ చిన్న ఇరుకు గదిలో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. బీరువాలు, ఫర్నిచర్ సరిగ్గా లేవు. రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడంతో కాంపిటీషన్ మెటీరియల్ రాక యువత పోటీ పరీక్షలకు ప్రిపేర్ కాలేపోతున్నామని అంటున్నారు. సొంత భవనం కోసం నిధులు మంజూరైనప్పటికీ ప్రభుత్వ స్థలం లేక నిర్మాణం చేపట్టడం లేదని గ్రంథాలయ శాఖ సిబ్బంది తెలిపారు.

అందుబాటులో లేని పోటీ పరీక్షల పుస్తకాలు

తాండూర్ మండల కేంద్రంలో శాఖ గ్రంథాలయంలో అరకొర సౌకర్యాలు ఉన్నాయి. పురాతన భవనంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ లైబ్రేరియన్ లేకపోవడం ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ వారానికి నాలుగు రోజులు మాత్రమే వస్తున్నారు. ఆ రోజుల్లో మాత్రమే పాఠకులకు అన్ని రకాల బుక్స్ అందుబాటులో లభిస్తుండగా, మిగితా రెండు రోజులు కేవలం వార్తా పత్రికలతో సరి పెడుతున్నారు.

గ్రంథాలయంలో సమస్యల తిష్ట..


ప్రారంభానికి నోచుకోని వేమనపల్లి గ్రంథాలయం

వేమనపల్లి మండల కేంద్రంలో రూ. 27.50లక్షల నిధులతో నిర్మించిన గ్రంథాలయం అలంకారప్రాయంగా మారింది. కొత్తగా నిర్మించిన గ్రంథాలయం ప్రారంభానికి నోచుకోలేదు. ప్రారంభోత్సవానికి ముందే పైకప్పు పగుళ్లు తేలాయి. కిటికీలు సరైన రీతిలో అమర్చకపోవడంతో ఏర్పడిన ఖాళీ స్థలం నుంచి పాములు వెళ్లే ప్రమాదం పొంచి ఉంది. గ్రంథాలయం వద్ద మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ప్రహరీ సౌకర్యాలు లేవు. పోటీ పరీక్షల పుస్తకాలు కానరావడం లేదు.

పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



చెన్నూర్: పట్టణంలో రూ.2కోట్ల నిధులతో గ్రంథాలయ భవనం నిర్మించారు. గ్రంథాలయంలో పాఠకులు కూర్చునేందుకు కుర్చీలు, ఇతర సౌకర్యాలు ఉన్నాయి. గ్రంథాలయ అధికారి అందుబాటులో ఉంటున్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు ఉన్నాయి. గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది.

పాఠకులు ఫుల్.. సిబ్బంది నిల్



మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రం గ్రంథాలయం 1960లో ఏర్పాటుకాగా, కేంద్రం మంచిర్యాలను గ్రేడ్-2గా అప్‌గ్రేడేషన్‌గా మార్చారు. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు తెరిచి ఉంచాల్సి వస్తోంది. ప్రతి రోజు గ్రంథాలయానికి వచ్చే పాఠకులు 300మంది పైన ఉంటారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు 100నుంచి 200వరకు ఉంటారు. గ్రంథాలయంలో అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. కార్యదర్శితో పాటు ఇద్దరు లైబ్రేరియన్లు, కంప్యూటర్ ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అంటెడర్, వాచ్‌మెన్ నియమించాల్సి ఉంది. గ్రేడ్-2 అప్‌గ్రేడ్ చేసిన మంచిర్యాల గ్రంథాలయంలో కార్యదర్శిగా ఇన్‌చార్జీని నియమించారు. సిద్దిపేట, పెద్దపల్లి గ్రంథాలయం కార్యదర్శిగా విధులు నిర్వహిస్తుండటంతో ఇక్కడ ఇబ్బందులు తప్పటం లేదు. లైబ్రేరియన్‌ను జన్నారం నుంచి, ఇద్దరు ఔట్ సోర్సింగ్‌కు చెందిన అటెండర్లను బెల్లంపల్లి, మందమర్రిల నుంచి సర్దుబాటు చేశారు.

వారంలో రెండు రోజులే పుస్తకాలు..

కేంద్ర గ్రంథాలయం మంచిర్యాలలో కార్యదర్శి, లైబ్రేరియన్, సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు అటెండర్లు అందరూ ఇన్‌చార్జీలుగా విధులుగా నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జీ లైబ్రేరియన్ సోమ, మంగళ అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే పుస్తక గది (గ్రంథ పాలకుని) గది తాళం తెరుస్తాడు. తర్వాత గదికి ఎప్పుడు తాళం ఉంటుంది. ఆయన వచ్చినప్పుడు మాత్రమే పుస్తకాలు ఇస్తారు. అప్పుడే చదువుకోవాలి.. లేదా ఇంటి నుంచి తెచ్చుకోవటమే.. ఇతరుల నుంచి తీసుకోవటం మినహా చేసేది ఏమిలేకుండా పోతుంది. రెగ్యులర్ ఉద్యోగులను నియమిస్తేనే పాఠకులకు ఉపయోగం కానుంది. అస్తవ్యస్థంగా ఉన్నా గ్రంథాలయ ఉద్యోగుల డిప్యూటేషన్‌లతో పాటు ప్రస్తుత పోటీ పరీక్షల పుస్తకాల కొనుగోలుపై ప్రత్యేక చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

లక్సెట్టిపేటలో విశ్రాంతి భవనంలో...



లక్సెట్టిపేట: మండల కేంద్రంలో గ్రంథాలయానికి పక్కా భవనం లేక శిథిలావస్థకు చేరిన పాత విశ్రాంతి భవనంలో కొనసాగిస్తున్నారు. దీంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం సుమారు 14వేల పుస్తకాలు ఉండగా, 119మంది పాఠకులు వస్తున్నారు. పాత పుస్తకాలను భద్రపరిచేందుకు స్థలం లేకపోవడంతో సంచుల్లో కట్టి ఉంచుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని గ్రంథాలయానికి పక్కా భవనం కేటాయించాలని పాఠకులు కోరుతున్నారు.

దండేపల్లిలో అద్దె ఇంట్లో...



దండేపల్లి: మండల కేంద్రంలో సుమారు 35ఏళ్ల క్రితం శాఖ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పక్కా భవనం లేదు. దీంతో గ్రంథాలయాన్ని ఓ అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. లైబ్రరీ పక్కా భవనానికి నిధులు మంజూరైనా, స్థలం కేటాయించక పోవడంతో, కొత్త భవనం నిర్మాణం ఊసే లేకుండా పోయింది. గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుకాల గల ఖాళీ స్థలాన్ని గ్రంథాలయ భవనం కోసం కేటాయించినప్పటికీ, అక్కడ అసలు ఎందుకు నిర్మించడం లేదో అర్థం కావడంలేదు.

భీమారంలో గ్రంథాలయానికి స్వీపరే దిక్కు



భీమారం: మండల కేంద్రంలో 1977సంవత్సరంలో గ్రామపంచాయతీ కార్యాలయం భవనంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం నేటికీ కొనసాగుతుంది. గ్రామపంచాయతీ భవనం కూలిపోవడంతో చెర్కు సరోత్తంరెడ్డి నిర్మించి ఇచ్చిన రేకుల షెడ్డులో తాత్కాలికంగా గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. గ్రంథాలయ అధికారిని బదిలీ చేసి సంవత్సరం దాటిని ఇప్పటికీ కొత్తవారిని నియమించలేదు. ప్రతిరోజూ స్వీపరే గ్రంథాలయం తెరుస్తున్నాడు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, సొంత భవనంతో పాటు అధికారిని కూడా నియమించాలని పాఠకులు కోరుతున్నారు.

నస్పూర్‌లో ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యేకు యువకుల వినతి (ఫైల్)

నస్పూర్: పట్టణంలో నిరుద్యోగ యువత కోసం నేటి వరకూ గ్రంథాలయం ఏర్పాటు చేయలేదు. పోటీ పరీక్షలకు సిద్ధం అవడానికి గ్రంథాలయం ఏర్పాటు చేయాలని నిరుద్యోగ యువత ఎమ్మెల్యే, కలెక్టర్, ఏరియా జీఎంలను కలిసి వినతిపత్రాలిచ్చినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి లైబ్రరీ ఏర్పాటుకు సహకరించాలని కోరుతున్నారు.

నీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఆశయ్య

బెల్లంపల్లి: వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణ సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న పేదలకు వెంటనే పట్టాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు చెల్లించాలని, ఆలస్యం కావడం వల్ల ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకే రవి, నాయకులు రమణ, గోమాస అశోక్, చల్లూరి దేవదాస్, దాగం రాజారాం, శ్రీకాంత్, యాకూబ్, బాపన్న తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నిరుద్యోగులు

బెల్లంపల్లి: మెగా డీఎస్సీని ప్రకటించడాన్ని హర్షిస్తూ విద్యాంతులైన నిరుద్యోగులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి శనివారం బెల్లంపల్లిలో క్షీరాభిషేకం చేశారు. ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో స్థానిక బజారు ఏరియాలో ఉన్న శాఖ గ్రంథాలయ ఆవరణలో క్షీరాభిషేకం నిర్వహించారు. నిరుద్యోగులను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు ఎనగందుల వెంకటేష్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు శివప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాజీ బాబా, తాండూర్ మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి రాజలింగు, బాలకృష్ణ, అక్షిత, నిరుద్యోగులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత


మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పాతమంచిర్యాల: మున్సిపాలిటీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమళ్ల హరికృష్ణ అన్నారు. కార్మికులతో కలిసి శనివారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక యూనియన్ నాయకులు సుధాకర్, తిరుపతి, లింగయ్య,కుమార్, నవీన్, లక్ష్మినర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో టెక్నో కరికులం, ఐఐటీ, జేఈఈ తోక పేర్లతో నడిపిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు ఈదునూరి అభినవర్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల పేర్ల వెనుకాల ఎలాంటి తోక పేర్లతో ఉండకూడదని, కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో టెక్నో, కారికులం, ఐఐటీ, జేఈఈ, పేర్లతో విద్యార్థుల్ని మోసం చేస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా శ్రీపాదరావు జయంతి


నివాళులర్పిస్తున్న జెడ్పీసీఈవో గణపతి

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర మాజీ స్పీకర్ దివంగత శ్రీపాదరావు జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి శ్రీపాదరావు చేసిన సేవలను కొనియాడారు. సామాన్య కుటుంబం నుంచి జన్మించి అంచెలంచెలుగా ఎదిగి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేయడం ఆయన గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా కేంద్రంలో జెడ్పీ సీఈవో గణపతి, మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ పాల్గొనగా చెన్నూర్‌లో పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఎంపీవో అజ్మత్‌అలీ, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్ పాల్గొన్నారు. వేమనపల్లిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, ఎంపీఓ బాపురావు, భీమారంలో జెడ్పీటీసీ బుక్యా తిరుమల, మందమర్రిలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జీఎం మనోహర్, ఎస్వో టు జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, తాండూర్‌లో ఎంపీటీసీ సిరంగి శంకర్, సూపరింటెండెంట్ వేణుగోపాల్, రామకృష్ణాపూర్‌లో క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ మురళీకృష్ణ, కాసిపేటలో తహసీల్దార్ భోజన్న, డెప్యూటీ తహసీల్దార్ మాణిక్‌రావు, శ్రీరాంపూర్‌లో జీఎం సంజీవరెడ్డి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఎస్ఓటు జీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం అరవిందరావు, చిరంజీవులు, నస్పూర్‌లో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ సతీష్, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి, బెల్లంపల్లి, శ్రీరాంపూర్ ఏరియాల్లోని ఉద్యోగులకు అందుబాటులో ఉండేలా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఏరియా జీఎం మనోహర్‌కు శనివారం వినతిపత్రం అందించారు. నాయకులు వెంకటస్వామి, రాజేందర్, వెంకటేష్, సందీప్, సంజీవ్, చైతన్యరెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

'అంబేద్కర్ భవనానికి దారివ్వండి'

జన్నారం: యమండల కేంద్రంలో గల అంబేద్కర్ భవనానికి దారిని పునరుద్ధరించాలని అంబేద్కర్ సంఘం, దళిత సంఘాల నాయకులు శనివారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

దండేపల్లి: బీజేపీ దండేపల్లి మండల కమిటీతో పాటు దాని అనుబంధ కమిటీలను శనివారం ఎన్నుకున్నారు.

తాళ్లపేటలో రూమ్‌టూ రీడ్ ప్రోగ్రాం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో రూమ్‌టూ రీడ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. విద్యార్థులకు లిటరసీ క్లౌడ్ వెబ్‌సైట్ ద్వారా డిజిటల్ విధానంలో ప్రొజెక్టర్ ద్వారా కథల పుస్తకాలు, వీడియోలు చూపించారు.

కృత్రిమ గర్భధారణ లాభదాయకం

వేమనపల్లి: కృత్రిమ గర్భదారణతో మేలు రకం పశువులు జన్మిస్తాయని వేమనపల్లి వెటర్నరీ వైద్యుడు చందన్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగారాంలో రైతులకు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో శనివారం పాడి రైతులకు పలు సూచనలు చేశారు.

పాఠశాలలకు కుర్చీలు, ఫ్యాన్లు పంపిణీ

నెన్నెల/భీమారం: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో భీమారం జెడ్పీఉన్నత పాఠశాలకు, నెన్నెల మండలంలోని మైలారం, నార్వాయిపేట ప్రభుత్వ పాఠశాలలకు రాష్ట్ర అటవీఅభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి కుర్చీలు, ఫ్యాన్లు అందజేశారు.

ప్రశాంత్‌కు సన్మానం

చెన్నూర్‌రూరల్: ఇటీవల నిర్వహించిన డిగ్రీ గురుకుల కళాశాల అధ్యాపకుల ఎంపిక పరీక్షలో చెన్నూర్ పట్టణానికి చెందిన రేండ్ల ప్రశాంత్ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రశాంత్‌ను ఘనంగా సన్మానించారు.

'ప్రజాపాలన' హెల్ప్‌డెస్క్ ప్రారంభం

మందమర్రిరూరల్: ఎంపీడీవో ఆఫీస్‌లో ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన హెల్ప్‌డెస్క్ ప్రారంభిస్తున్నట్టు ఎంపీడీవో రాజేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

'ధరణి' సమస్యలపై స్పెషల్ డ్రైవ్

దండేపల్లి: ధరణి పోర్టల్ సమస్యలపై మండలంలోని చింతపల్లి, రెబ్బనపల్లి గ్రామాల్లో శనివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ సంధ్యారాణి చెప్పారు.